విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 16, సెప్టెంబర్ 2023

## గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలి

**విశాలాంధ్ర - ఉయ్యాలవాడ :** గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించవలసిన బాధ్యత మన అందరిపై ఉందని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గృహనిర్మాణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అల్లూరు, ఉయ్యాలవాడ, ఆర్.పాంపల్లె, సర్వాయిపల్లె, ఇంజేడు గ్రామాల్లో ఉన్న జగనన్న లేఔట్ కాలనీలలో 281 గృహాలు మంజూరు కాగా అల్లూరు, ఉయ్యాలవాడ గ్రామాల్లో ఇద్దరూ లబ్ధిదారుల చొప్పున నిర్మాణాలు ప్రారంభించడంపై హౌసింగ్ శాఖ పనితీరుపై ఎంపీడీవో అసంతృప్తి వ్యక్తం చేశారు. మౌలిక వసతులు, నీటి సరఫరా, విద్యుత్, రహదారుల సమస్యను పరిష్కరించేందుకు అధికారులు ప్రజా ప్రతినిధులతో సమన్వయంతో పని చేస్తే గృహ నిర్మాణాలు వేగవంతం అవుతాయని మండల వైసీపీ కన్వీనర్ బుడ్డ చంద్రమోహన్‌రెడ్డి అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో గృహనిర్మాణ ఏఈ నరసింహారావు, ఏపీవో రవిప్రకాష్,సర్పంచులు గురుప్రసాద్ రెడ్డి, సాయిరెడ్డిలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కక్షపూరిత విధానాలను వ్యతిరేకించండి

- సీపీఐ ఆధ్వర్యంలో 17న రౌండ్ టెబుల్ సమావేశం
- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు

**విశాలాంధ్ర - నంద్యాల :** రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్షాలపై పోలీస్ వ్యవస్థను అడ్డు పెట్టుకొని కక్షపూరిత విధానాలను ప్రతిపక్ష పార్టీలు అన్ని వ్యతిరేకించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు కోరారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడి నిరసనలు తెలిపినా, ఆందోళన నిర్వహించిన అలాంటి వారిపై పోలీసులతో అక్రమంగా అరెస్టులు, గృహ నిర్బంధాలు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని అవహాస్యం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరశిస్తూ ఈనెల 17న వామపక్ష,అఖిలపక్ష పార్టీలతో కలిసి సీపీఐ కార్యాలయంలో నిర్వహించనున్న ఈ రౌండ్ టేబుల్ సమావేశం జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక చర్యలకు నిరసనగా చేపట్టనున్న ఈ సమావేశానికి సీపీఎం, సీపీఐ ఎంఎల్, న్యూ డెమోక్రసీ, తెలుగుదేశం, కాంగ్రెస్, జనసేన పార్టీలతో పాటు ప్రజా సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని రంగనాయుడు పిలుపు నిచ్చారు. సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, పట్టణ కార్యదర్శి ప్రసాద్, పట్టణ సహాయ కార్యదర్శి సోమన్న, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బరాయుడు, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, సీపీఐ నాయకులు మదిలేటి పాల్గొన్నారు.

## విషపు ఆహారం తిని.. గొర్రెలు మృతి

**విశాలాంధ్ర - రుద్రవరం :** విషపు పశుగ్రాసాన్ని తిని పది గొర్రెలు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ముత్తలూరులో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన హుస్సేన్ వలి అనే రైతు 30 గొర్రెలను పెంచుకుంటూ జీవనం సాగించేవాడు. ఇదే క్రమంలో గ్రామానికి సమీపంలో ఉన్న అనాధ ఆశ్రమం వద్ద శుక్రవారం గొర్రెలను మేపుకునేందుకు తోలుకొని వెళ్ళాడు. జీవాలు బీడు భూమిలో గడ్డి మేస్తుండగా పక్కనే ఉన్న ఓ గెట్టు వద్దకు వెళ్లి గట్టుపై ఉన్న విషపు గడ్డిని తిని ఒకదాని వెంట మరొకటి కిందపడి పోయాయన్నారు. ఎందుకు ఇలా జీవాలు కింద పడుతున్నాయని విషయం తెలుసుకునే సరికి ఆ గెట్టు పైన విషపు గడ్డి మందును పిచికారి చేయడంతో ఇలా జరిగిందని తెలుసుకున్న రైతు తీవ్ర ఆవేదన చెందాడు.తీవ్ర అస్వస్థతకు గురైన వాటిని కాపాడుకునేందుకు స్థానిక పశు వైద్య కేంద్రానికి వెళ్ళగా పశు వైద్య సిబ్బంది అక్కడ లేకపోవడంతో ఎర్రగుడిదిన్నె వైద్య సిబ్బందికి సమాచారం తెలుపడంతో సిబ్బంది హుటాహుటిన గ్రామానికి చేరుకొని అస్వస్థతకు గురైన గొర్రెలకు మందులు వేయడం జరిగిందన్నారు. మృతి చెందిన గొర్రెల విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని హుస్సేన్ వలి తెలిపారు.

## గడువు పెంపు

**విశాలాంధ్ర - బేతంచెర్ల రూరల్ :** ఖరీఫ్ 2023లో వేసిన పంటలను పంట నమోదు చేసుకోవడానికి ఈనెల 30 వరకు గడువును ప్రభుత్వం పొడిగించిందని, రైతులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి జి.కిరణ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంత వరకు 81 శాతం వరకు పంట నమోదు జరిగిందన్నారు. మిగిలిన19 శాతం పంట నమోదు చేయించుకోని రైతులు వెంటనే సంబంధిత రైతు భరోసా కేంద్రంలోని అగ్రికల్చర్ అసిస్టెంట్ ను సంప్రదించి పంట నమోదు చేసుకోవాలని తెలిపారు. పంట నమోదు వల్ల పంట నష్ట పరిహారం, పంట భీమా, సున్న వడ్డీ పంట రుణాలు, పంట రుణాలు, మద్దతు ధరకు పంటను అమ్ముకోవడం వంటి ప్రయోజనాలను రైతులు పొందవచ్చని ఆయన తెలిపారు.

## సమాజ ప్రగతి సాధకులు నేటి బాలలే



**విశాలాంధ్ర - నందికొట్కూరు :** ప్రస్తుత సమాజంలో ప్రగతి సాధకులు బాలలేనని ఎమ్మెల్యే తోగూర్ ఆర్థర్ తెలిపారు. శుక్రవారం వడ్డేమాన్‌లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం, సిబ్బంది ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను పూలమాలతో సన్మానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడినవిద్యను అభ్యసించినప్పుడే అత్యున్నత శిఖరాలు అధిరోహించ గలన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జస్వంత్, అనుప్రియలకు సన్మానం చేశారు. అండర్ -17 ఖో-ఖో పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజయ్‌ను ఎమ్మెల్యే అభినందించారు. ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయురాలు రాజేశ్వరి దేవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమాలతో టీడీపీ ఓటమి ఖాయం

**విశాలాంధ్ర -చాగలమర్రి :** ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో తెలుగుదేశం పార్టీ ఓటమి ఖాయమని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి పేర్కొన్నారు.శుక్రవా రం మండలంలోని ముత్యాలపాడు -2 సచి వాలయం పరధిలోని ఎంతాండా, చక్రవర్తులపల్లె గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా ఎమ్మెల్యేకు సర్పంచ్ శంకరమ్మభాయి, ఎంపీపీ రామిశెట్టి వీరభద్రుడు, వైసీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి బాబులాల్, మండల కన్వీనర్ కుమార్‌రెడ్డి, సాగునీటి సంఘంఅధ్యక్షుడు శేషురమేష్, వైసీపీ నాయకులు, కార్యకర్తలు గజమాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్ళి సంక్షేమ పథకాలు వివరి స్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట జిల్లా సేవాదల్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు దస్తగిరి, ఎంపిటీసిలు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## వైద్య విద్యా రంగంలో విప్లవాత్మక సంస్కరణలు



**విశాలాంధ్ర-నంద్యాల :** వైద్య విద్యారంగంలో అనేక విప్లవాత్మక సంస్కరణలు ప్రవేశ పెట్టి ఖచ్చితమైన అమలుకు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారని ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన వైద్య కళాశాలను సిఎం జగన్ వర్చువల్ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా మాట్లాడుతూ రాష్ట్రంలో 11 వైద్య కళాశాలు మాత్రమే ఉండేవన్నారు. వైసీపీ ప్రభుత్వ ముఖ్యమంత్రి మరో 17 వైద్య కళాశాలు మంజూరు చేయగా, 5 కాలేజీలు ప్రారంభించడం చారిత్రాత్మక విషయమన్నారు. జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో జిల్లా ప్రజల చిరకాలవాంఛ నెరవేర్చారన్నారు. 52 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో నిర్మించిన వైద్య కళాశాల చారిత్రక కట్టడంగా నిలుస్తుందన్నారు. ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ నంద్యాల మెడికల్ కళాశాల ప్రారంభ నేపథ్యంలో జిల్లా ప్రజల కల నెరవేర్చారని పేర్కొన్నారు. ప్రభుత్వ జన రల్ ఆసుపత్రిలో కూడా 300 నుంచి 500 పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి, ఎంపి పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇషాఖ్‌బాషా, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మునిసిపల్ చైర్పర్సన్ మాబున్నిసా, మైనారిటీ సంక్షేమ అభివృద్ధి సలహాదారు హాబీబుల్లా, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత, విద్యార్థులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## హోంగార్డ్స్ సంక్షేమానికి ప్రధాన్యత




**విశాలాంధ్ర-నంద్యాల:** హోంగార్డ్స్ సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రధాన్యత ఇస్తామని హోంగార్డ్స్ సంక్షేమ దివాస్ సందర్భంగా జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి హామీ ఇచ్చారు. జిల్లాలో మొదటిసారిగా హోంగార్డ్స్ సంక్షేమ దివస్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్పీ రఘువీర్ రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా హోంగార్డ్స్ విధుల్లోని సమస్యలు, ఐడి కార్డ్స్, బందోబస్తుకు సంబంధించి బస్‌పాస్‌లు, సిబ్బంది సంక్షేమం, స్కూల్ ఫీజ్ మొదలగునవి తెలిపారు. కార్యక్రమంలో హోంగార్డ్ కామండెంట్ మహేశ్ కుమార్, అడిషనల్ ఎస్పీ వెంకట రాముడు, రిజర్వు ఇన్స్పెక్టర్ సుధాకర్ హోంగార్డ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## టీడీపీకి ఎదురుదెబ్బ

**విశాలాంధ్ర -పాణ్యం :** మండలంలో టీడీపీకి ఎదురు దెబ్బ తగిలింది. పరిధిలోని గోనవరం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ భాస్కర్, సురేష్ రెడ్డిల ఆధ్వర్యంలో 40 కుటుంబాలు తెలుగుదేశం పార్టీని వీడి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి సమక్షంలో వైసీపీ కార్యాలయంలో శుక్రవారం వైసీపీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు స్కిల్ డెవలప్మెంట్ కుంభకోణంలో సిఐడి పోలీసులు అరెస్టుతో ఆపార్టీని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సూర్యనారాయణ రెడ్డి,మండల కన్వీనర్ సుమంత్ రెడ్డి,వైసీపీ నాయకులు కరుణాకర్ రెడ్డి,చందమామ బాబు, జాకీర్ భాష, సుబ్బరాయుడు, చంద్రారెడ్డి, ఎల్లగౌడ్, బాలిరెడ్డి, ప్రకాశం, నజీర్ హుస్సేన్, మాలి హుస్సేన్, నజీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక సేవ అందరి బాధ్యత

**విశాలాంధ్ర - డోన్ :** సామాజిక సేవ అనేది అందరి బాధ్యతని, సమాజ హితం కోరుతూ స్ఫూర్తి సేవా సమితి చేస్తున్న పలు రకాల సేవా కార్యక్రమాలు అందరికి స్ఫూర్తిదాయకమని డోన్ వైసీపీ యువ నాయకుడు, సీమ సుబ్బారెడ్డి అన్నారు. సుబ్బారెడ్డి అత్త, మామలు స్వర్గీయ మెట్టు చంద్రావతి, శివరాజన్‌రెడ్డి దంపతుల జ్ఞాపకార్థం శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్ఫూర్తిటీమ్ చేస్తున్న సామాజిక సేవ కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందిస్తానని వారు తెలిపారు. స్ఫూర్తి సభ్యులు ఆలా మధు, బ్రహ్మానంద రెడ్డి, యోగ, ఆటో మధు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్వేది పవిత్రాలతో ప్రత్యేక పూజలు

**విశాలాంధ్ర - ఆళ్లగడ్డ :** తూర్పుగోదావరి జిల్లాలోని అంతర్వేది లక్ష్మీ నరసింహ స్వామి వారి పవిత్రోత్సవాలకు వినియోగించే పవిత్రమాలలను శుక్రవారం అహోబిలం లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో ఉంచి అహోబిల దేవస్థానం ప్రధానార్చకులు వేణుగోపాల ఆచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అహోబిల మఠం పీఠాధిపతుల చేత అక్షింతలు తీసుకొని పీఠాధిపతుల ఆశీర్వాదం పొందారు. అంతర్వేది లక్ష్మీ నరసింహ స్వామి క్షేత్రానికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా అహోబిలం దేవస్థానం ముద్రకర్త, ప్రధాన అర్చకులు వేణుగోపాలచార్యులు, అంతర్వేది దేవస్థానం అర్చకులు సుదర్శనమ్ రమేష్ స్వామి, రంగాచార్యులుకు పవిత్ర మాలలు అందచేశారు.రంగారావు గోష్ఠి సభ్యులు విద్యుత్ డిఈఈ రవికాంత్ చౌదరి, శంకర్ రెడ్డి, మల్లె వీరచంద్ర, రామకృష్ణ, మురళి, ఉప్పల ప్రసాదు, శేష నాయక్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య సమస్యలపై ఆరా

**విశాలాంధ్ర - కొలిమిగుండ్ల :** జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజల ఆరోగ్య సమస్యలపై వివరాలను సేకరిస్తామని ఎంపీడీవో ప్రసాద్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని బెలుంలో చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ వాలంటీర్లు, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలపై వివరాలను సేకరిస్తారన్నారు. ఈనెల 30న గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశానికి ప్రజలందరూ సద్వినియోగ పరచుకోవాలని సూచించారు. గ్రామంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని పరిశీలించారు.

## ఓజోన్ పొరను రక్షించుకుందాం

**విశాలాంధ్ర-చాగలమర్రి :** భూమి చుట్టూ ఉన్న 'ఓజోన్ పొర'ను రక్షించు కుందామని జిల్లా రిసోర్స్ పర్సన్ నాగేంద్రకుమార్ పిలుపు నిచ్చారు. శుక్రవారం చాగలమర్రి లోని జడ్‌పి బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్ఎం విజయ లక్ష్మి, జిల్లా సైన్స్ కో-ఆర్డినేటర్ సుబ్బారెడ్డిల ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమిని అతినీల లోహిత కిరణాల నుండి రక్షించే ఓజోన్ కవచాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలను పెంచి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు వారి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

# నీరు నింపకముందే ఎలా ప్రారంభిస్తారు ..!

- ◆సీఎం జగన్‌కు ప్రచార ఆర్భాటం తప్పా అభివృద్ధి పట్టదు
- ◆డోన్‌లో జగన్ పర్యటనను అడ్డుకుంటాం
- ◆వైసీపీ పనితీరుపై సీపీఐ నాయకులు ధ్వజం

**విశాలాంధ్ర - ప్యాపిలి :** నీళ్లు నింపకముందే చెరువులను ఎలా ప్రారంభిస్తారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజ నేయులు, సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడులు ప్రభుత్వాన్ని నిలదీశారు. శుక్రవారం ప్యాపిలి మండలంలోని 14 చెరువులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డోన్, పత్తికొండ నియోజకవర్గాల్లోని 68 చెరువులకు హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ద్వారా నీరు నింపి రైతుల కష్టాలు తీరుస్తామని వైసిపి ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. ఇందుకోసం రూ.220 కోట్లు నిధులు కేటాయించినట్లు ప్రభుత్వం ప్రకటించిదన్నారు.వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగున్నర ఏళ్లుపూర్తయిన కూడా నీరు నింపిన పాపాన పోలేదన్నారు. నియోజకవర్గంలోని వేంగళాంపల్లి, ఏనుగుమర్రి, అప్పిరెడ్డిపల్లి చెరువులను తూతు మంత్రంగా అభివృద్ధి పనులు చేశారన్నారు. చెరువుల అభివృద్ధి పనులను పూర్తిస్థాయిలో చేయకుండానే ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి నియోజకవర్గంలో చెరువుల ప్రారంభోత్సవానికి వస్తుండడం విచారకరమన్నారు.చెరువులను నేను నింపకుండానే ఎలా ప్రారంభోత్సవాలు చేస్తారని సీపీఐ నాయకులు ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని ప్రశ్నిస్తున్నారు. కేవలం ప్రచార ఆర్భాటాల కోసమే ప్రభుత్వం ప్రారంభోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని వారు విమర్శించారు. 68 చెరువులకు నీరు నింపిన తర్వాతే ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని అడ్డుకుంటామని వారు హెచ్చరించారు.కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, మోటా రాముడు, డోన్, ప్యాపిలి, మండల కార్యదర్శులు పులి శేఖర్, వెంకటేష్‌లు మాట్లాడుతూ నియోజకవర్గంలో వర్షాభావ పరిస్థితులతో రైతులకు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని తక్షణమే ప్రభుత్వం నియోజకవర్గాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంటలు దెబ్బతినడంతో రైతుల బతుకులు దుర్భరంగా మారాయని, బతుకు జీవుడా అంటూ పొట్ట చేత పట్టుకొని రైతులు, రైతు కూలీలు వలసబాట పడుతున్నారని తక్షణమే ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బుగ్గన రాజేంద్రనాథరెడ్డి చెరువులకు నీళ్లు నింపే ఆందోళనలో సీపీఐతో కలసి పాల్గొన్నారని గుర్తు చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నియోజకవర్గంలోని చెరువులకు నీరు నింపి తాగు, సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. అయితే హామీ ప్రకారం ఆ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిప్పటికీ చెరువులకు నీళ్లు నింపలేదని వారు విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం చెరువులకు నీళ్లు నింపి రైతులను ఆదుకోవాలని, లేని పక్షంలో రాబోయే ఎన్నికలలో వైసీపీకి తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నారాయణ, పిక్కలి వెంకటేష్, ఎస్ఎఫ్ నాయకులు శివ కేశవులు, సిద్ధార్థ రాయ్, ఏఐటీయూసీ నాయకులు, శీను, రాము,పెద్దు, రంగన్న, నాయకులు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాజెక్టుల రూపకర్త మోక్షగుండం విశ్వేశ్వరయ్య







**విశాలాంధ్ర - బనగానపల్లె :** ప్రాజెక్టుల రూపకర్త మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని బిల్డర్ ఇంజనీర్ మక్బుల్ హుస్సేన్ అభివర్ణించారు. స్థానిక బిల్డర్స్ కార్యాలయంలో విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. శుక్రవారం బిల్డర్ ఇంజనీర్ మక్బుల్ హుస్సేన్ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఇంజనీర్స్, ఎం.జక్రియ అలీ బేగ్, ఎం. అక్బర్ బాషా లకు ఇంజనీంమబ్బులు హుస్సేన్ ఆధ్వర్యంలో శాలువ తో సన్మానించారు. ఆయన సేవలను గుర్తించి 1955లో దేశంలోనే అత్యున్నత పురస్కారం భారతరత్న అవార్డు అందుకున్నారని పేర్కొన్నారు.

**పాణ్యం :** ఇంజనీర్లు సామాజిక బాధ్యత పై దృష్టి సారించాలని ఎస్సార్ బీసీ ఇంజనీరు అమృత్ సాగర్ అన్నారు. ప్రముఖ సివిల్ ఇంజనీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా శుక్రవారం ఆర్‌జియం ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. సివిల్‌విభాగం ఆధ్వర్యంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మోక్షగుండం చేపట్టిన నిర్మాణాలు ప్రాజెక్టులు తదితర వాటిపై వివరించారు. గోరుకల్లు రిజర్వాయర్ నిర్మాణంపై పవర్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

**ఘనంగా మోక్షగుండం జయంతి వేడుకలు:** మోక్ష గుండం విశ్వేశ్వరయ్య జయంతి వేడుకలు శాంతిరం ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ సుబ్ర మణ్యం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మోక్షగుండం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు తయారుచేసిన వివిధ రకాల నమూనాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

**కోవెలకుంట్ల :** మండల కేంద్రమైన వాసవి బొమ్మిదాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫిజిక్స్ డిపార్ట్మెంట్ అధ్యాపకులు శ్రీరామ్ ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజాగ్రహం.. నివురుగప్పిన నిప్పులాంటిది

**విశాలాంధ్ర - నెట్‌వర్క్ :** ప్రజాగ్రహం.. నివురుగప్పిన నిప్పులా ఉందని, రాష్ట్ర ప్రజలు త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఓటు అనే వజ్రాయుధంతో వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపడం ఖాయమనీ తెలుగుదేశం పార్టీ నేతలు పలువురు పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా చేపట్టిన దీక్షలు శుక్రవారంతో మూడో రోజుకు చేరుకున్నాయి. అందులో భాగంగా ఆయా మతాల నాయకులు సమీపంలోని ప్రార్థనాలయాకు చేరుకొని, తమనేత అయిన చంద్రబాబును నైపుణ్యాభివృద్ధి కుంభకోణం కేసు నుండి నిర్దోషిగా విడుదల చేయాలని ప్రార్థనలు చేశారు.

నంద్యాల : దీక్షలో ఎన్ఎండి.ఫరూక్, మాజీ ఎమ్మెల్యే భూమా, ఏవీలు

బనగానపల్లె: ర్యాలీగా బయలుదేరిన ముస్లిం సోదరులు

నంద్యాలలో ప్రత్యేక ప్రార్థనలు

ఆళ్లగడ్డ : దీక్షలో మాజీ మంత్రి భర్త భరత్‌కు మద్దతు తెలుపుతూ..

బండిఆత్మకూరు : దీక్షలో మాట్లాడుతున్న నేత, బీవి

ఆత్మకూరులో ప్రత్యేక ప్రార్థనలు

ఆత్మకూరులో దీక్షలు విరమింపజేస్తూ..

వెలుగోడు: ర్యాలీగా బయలుదేరిన నాయకులు, ముస్లింలు

## మధ్యాహ్న భోజనం తనిఖీ

**విశాలాంధ్ర-చాగలమర్రి:** మండల పరిధిలోని ముత్యాలపాడు తాండా గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంపీడీవో మహబూబ్ దౌలా,ఎంఈఓ న్యాంతుల్లాలు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పాఠశాలలోని పలు రికార్డులు పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు అందించే భోజనం మెనూ ప్రకారం నాణ్యమైనది అందించాలని సూచించారు.అనంతరం నాడు-నేడు పనులను పరిశీలించారు.పీఆర్ ఏఈ కొండారెడ్డి, హెచ్ఎం హుసేన్‌పీరా పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత



**విశాలాంధ్ర - వెలుగోడు:** మండల కేంద్రమైన వెలుగోడు జలాశయంలో పుట్టి ప్రమాదంలో గత ఏడాది ఏప్రిల్ 21న వేల్పనూరుకు చెందిన శీలం శ్రీనివాసులు, సతీమణిశీలం మద్దమ్మ మృతి చెందారు.మృతి చెందిన కుటుంబానికి గడప గడప కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి చేతుల మీదగా రూ. 1.26 లక్షల విలువ గల చెక్కుతో పాటు దుస్తులు అందజేశారు.ఈసహకారం వెలుగోడు సర్పంచ్ జైపాల్, నంద్యాల తహశీల్దార్ శ్రీనివాసులు, వెలుగోడు రైస్ మిల్లర్స్, తనస్నేహితుల సహకారంతో చందా రూపంలో సేకరించారని ఎమ్మెల్యేకు వివరించారు. మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు రమేష్‌గుప్తా ఆధ్వర్యంలో గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అందజేసిన పథకాలను వివరిస్తూ, వారి వ్యక్తిగత సమస్యలను తీర్చాలని అధికారుల ఆదేశాలు ఇస్తూ ముందుకు వెళ్లారు. కార్యక్రమంలో నియోజకవర్గం సమన్వయ కర్త శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## నేడు టెంకాయల వేలం

విశాలాంధ్ర - బనగానపలి : మండల పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాగంటిలో శనివారం ఉదయం 10 గంటలకు టెంకాయలు అమ్ముకుని హక్కు కొనేందుకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ బుచ్చిరెడ్డి పేర్కొన్నారు. వేలంపాటలో పాల్గొని పాటాదారులు ఆలయ నిబంధన మేరకు ధరావత్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని అలాగే ఏడాది కాలానికి వేలంపాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## ఆలయ నిర్మాణానికి విరాళం

**విశాలాంధ్ర - కోవెలకుంట్ల:** మండల పరిధిలోని ఏడు కపిలేశ్వరబావి దగ్గర నూతన శివాలయం నిర్మించనున్నారు. ఈ గుడి నిర్మాణం కోసం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి, మాజీమార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం నాగేశ్వర్‌రెడ్డి రూ.20వేలు విరాళంగా అందజేశారు. శివాలయంలోని గుడి అర్చకునికి విరాళాన్ని అందజేశారు.కార్యక్రమంలో టీడీపీ యువ నాయకుడు అమర్‌నాథ్‌రెడ్డి, పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## పంట రుణ మాఫీ చేయాలి

**విశాలాంధ్ర-బనగానపల్లె:** ఈఏడాది రాష్ట్రంలో తక్కువ వర్షపాతం నమోదు కావడంతో పంటలు పండించే పరిస్థితి లేనందున రైతులు బ్యాంకులో నుండి పంటలు పండించేందుకు తీసుకున్న రుణాలు చెల్లించే పరిస్థితి లేదని, ప్రభుత్వం పంట రుణాలు మాఫీ చేయాలని ప్రభుత్వాన్ని జిల్లా గిరిజన సమైక్య అధ్యక్షుడు కాలింగ రాముడు పేర్కొన్నారు. అలాగే కాలువలకు నీరు సక్రమంగా విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో అవుకు మండల కార్యదర్శి చిన్నబాల, సుంకన్నలు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి పోటీలకు విద్యార్థులు

**విశాలాంధ్ర-చాగలమర్రి :** మండల పరిధిలోని ముత్యాలపాడు సమీపంలోని బర్డ్స్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి జంప్‌రోప్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ పాల్‌రాజారావు, హెచ్ఎం సింధూరలు తెలిపారు. శుక్రవారం జరిగిన అభినంద సభలో వారు మాట్లాడుతూ పాఠశాలకు చెందిన విద్యార్థులు సంజనశ్రీ, దస్తగిరి, వైష్ణవి, కళ్యాణిలు ఈనెల 9,10 తేదీల్లో గుంటూరు జిల్లా తెనాలిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఏడుగురు విద్యార్థులు పాల్గొన్నారన్నారు. వీరిలో 4గురు,బంగారు,కాంస్య పతకాలతో పాటు ప్రసంసా పత్రాలను సాధించి జాతీయ స్థాయి కి ఎంపికయ్యారన్నారు.అక్టోబర్ 14 నుంచి తెనాలిలో జరగనున్న పోటీల్లో అండర్ -14 విభాగంలో కళ్యాణి, అండర్ -12 విభాగంలో సంజనశ్రీ,దస్తగిరి,వైష్ణవిలు ఆంధ్ర రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తారనివివరించారు.ఎంపికైన విద్యార్థులను, పిఈటి రవిశంకర్, కో-ఆర్డినేటర్ భాస్కర్‌లను బర్డ్స్ డైరెక్టర్ పాల్‌రాజారావు, హెచ్ఎం సింధూర, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

# విశాలాంధ్ర కర్నూలు

www.visalaandhra.com

కర్నూలు, శనివారం 16,సెప్టెంబర్ 2023




## యధేచ్చగా అక్రమ తవ్వకాలు

**విశాలాంధ్ర-హొళగుంద:** మండల కేంద్రంలో నడిబొడ్డులో ఉన్న సర్వేనెంబర్ 557 /1 లో అధికార పార్టీకి చెందిన చోట నాయకులు ఎదేశ్చగా జేసీబీ యంత్రాలను పెట్టి అక్రమ తవ్వకాలు చేసి కొండను చదును చేశారు. కోట్ల విలువ రూపాయలు పలికే కొండను తవ్వి అక్రమార్కులకు పాల్పడుతున్నారని ప్రజలు శుక్రవారం తహశీల్దార్ హుసేన్ సాబ్‌కు ఫిర్యాదుచేశారు. వాట్స్ గ్రూపులో కొండ తవ్వే అక్రమాల దృశ్యాలు చదును చేసిన ప్రదేశం తహశీల్దార్ పరిశీలించారు.కొండలు ఇలాగే తవ్వకుంటూ పోతే భావిత రాలకు కష్టంగా మారుతుందని ప్రజలు వాపోయారు. కొండలు కరిగిపోతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఎక్కువగా ఉన్నాయి. కొండలను రక్షించాల్సిన రెవిన్యూ మైనింగ్ అధికారులు పత్తా లేకుండా పోయారని ప్రజలు వాపోయారు.కొండలను తవ్వాలంటే మైనింగ్ అధికారుల అనుమతి తప్పని సరిగా ఉండాలి అయితే ఇవేవీ పట్టించుకోకుండా కొందరు అక్రమార్జని ధ్యేయంగా పెట్టుకొని కొండల్లో అక్రమ తవ్వకాలు చేపట్టారని ప్రజలు తెలిపారు .సంబంధిత అధికారుల నిర్లక్ష్యం ఉదాసీన వైఖరి వల్లే అక్రమార్కులు రెచ్చిపోతున్నారని సీపీఐ కార్యదర్శి పెద్దహేటమారెప్ప ,రైతు సంఘం నాయకుడు కృష్ణ వాపోయారు .జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని కొండల్లో జరుగుతున్న అక్రమ తవ్వకాలను నియంత్రించాలని కొండకు రక్షణ కల్పించాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు.తహశీల్దారు హుస్సేన్ సాబ్ విలేకరులతో మాట్లాడుతూ కొండల్లో అక్రమ తవ్వకాలు జరగడం వాస్తవమేనని వెళ్లి పరిశీలించానన్నారు .14 ఎకరాల 86 సెంట్లు కొండ ఆర్ఎస్ఆర్ ప్రకారంగా తమదే నన్నారు.ఎవరికి ఎటువంటి డి పట్టాలు పొజిషన్ సర్టిఫికేట్ ఇవ్వలేదని అన్నారు సర్వేయర్ ద్వారా కొండను కొలిచి కొండకు రక్షణ కల్పిస్తామని కొండల్లో ఎలాంటి అక్రమాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు .మైనింగ్ అధికారులు అందుబాటులో లేనందు వల్లే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని అన్నారు. కొండల్లో అక్రమ తవ్వకాల పనులు జరగకుండా సిబ్బంది ద్వారా నిలిపివేశామని సమాధానం ఇచ్చారు .సమావేశంలో ఆర్ ఐ దినూజ్ కుమార్ వీఆర్వో నాగరాజ్ పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ చేతివాటం

**విశాలాంధ్ర-కోసిగి :** అక్రమ ఇసుక ట్రాక్టర్ల నుంచి ఓ కానిస్టేబుల్ నెల నెల వేల రూపాయలు వసూలు చేస్తున్న ట్లు స్వయాన ట్రాక్టర్ యజమా ని, డ్రైవర్లే కానిస్టేబుల్ పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే కోసిగి పోలీస్ స్టేషన్ పరిధిలోని వాగులు, వంకలు, చెరువులలో ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరలి స్తున్న ఇసుక ట్రాక్టర్ల యజమానుల నుంచి నెలకు ఒక ట్రాక్టర్ కు 15 వేల రూపాయలు స్థానిక పోలీస్ స్టేషన్ లో పనిచేస్తున్న కానిస్టేబుల్ సి.వీరన్న ఇస్తున్నట్లు గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమాని కట్ల.లక్ష్మన్న, ట్రాక్టర్ డ్రైవర్ కొరవి.నాగరాజు లు తెలిపారు. శుక్రవారం అక్రమంగా ఆర్లబండ గ్రామ వంక నుంచి ఇసుక తరలిస్తున్న కట్ల లక్ష్మన్న కు చెందిన ఇసుక ట్రాక్టర్ను సబ్ పోలీసులు పట్టుకోవడం జరిగింది. లోకల్ పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నెలనెలా డబ్బులు ఇస్తున్న కూడా తమ ట్రాక్టర్లను పట్టుకొని మమ్మల్ని తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని వాపోయారు. పోలీసులకు నెలకు వేల రూపాయలు డబ్బులు ఇచ్చామన్నారు. కానిస్టేబుల్ సి.వీరన్న కూడా వేల రూపయల డబ్బులు ఇచ్చామని , ఇప్పటికీ ఎస్ఐ పేరు చెప్పి డిమాండ్ చేస్తు న్నాడన్నారు.ఇలా అయితే మేము ఎలా బతికేదని ట్రాక్టర్ యజమాని, డ్రైవర్లు తెలిపారు. ఈ కానిస్టేబుల్ పై గతంలోనే అక్రమ వసూళ్ల ఆరోపణలు చాలానే ఉన్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా మొన్న 10 రోజుల క్రితం జుమ్మాలదిన్నె దగ్గర జరిగిన బస్సు, కారు యాక్సిడెంట్లో కారు ఓనర్ నుంచి 15 వేల రూపాయలు డబ్బులు కూడా డిమాండ్ చేసినట్లు సమాచారం.స్వయానా ట్రాక్టర్ యజమాని కట్ల.లక్ష్మన్న, డ్రైవర్ కొరివి నాగరాజులు కానిస్టేబుల్ సి. వీరన్న ఇసుక ట్రాక్టర్ల నుంచి అక్రమ వసూళ్లపై విలేకరుల ముందు చెప్పుకొని వాపోయారు. సంబంధిత పోలీస్ ఉన్నత అధికారులు కానిస్టేబుల్ సి. వీరన్న పై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.. ఈ విషయంపై ఎస్సై కు ఫోన్లో వివరణ కోరగా అందుబాటులోకి రాలేదు.....

## హెలిప్యాడ్ స్థలం పరిశీలన

**విశాలాంధ్ర - క్రిష్ణగిరి :** ఈనెల 19న రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి క్రిష్ణగిరి మండల పర్యటన ఖరార్ కావడంతో సీఎం హెలిప్యాడ్ స్థలాన్ని జాయింట్ కలెక్టర్ నారపరెడ్డి మౌర్య, జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ శుక్రవారం పరిశీలించారు. అనంతరం లక్క సాగరం గ్రామ సమీపంలో ఉన్న పొలంలో సీఎం హెలికాప్టర్ దిగేందుకు స్థలాన్ని నిర్ణయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెలిప్యాడ్ స్థలం నుండి ఆలంకొండ పంప్ హౌస్ దగ్గరికి వాహనంలో వెళ్లి 252 కోట్లతో నిర్మాణం చేపట్టిన సాగునీటి ప్రాజెక్టు పథకాన్ని బటన్ నొక్కి ప్రారంభిస్తారన్నారు. హంద్రీనీవా కాలువ నుండి పంపింగ్ ద్వారా ప్రస్తుతం 70 చెరువులకు సాగునీరు విడుదల చేస్తారన్నారు. గుత్తేదారులు దాదాపు పైపులైన్ పనులు పూర్తయినట్లు వారు తెలిపారు. మూడు రోజుల్లో ఏర్పాట్లన్నీ త్వరితగతన ముమ్మారంగ కొనసాగాలని సంబంధిత శాఖ అధికారులకు వారు ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనలో అధికారులు బాధ్యతగా పనిచేయాలని వారు తెలిపారు. సీఎం పర్యటనకు అంతరాయం కలగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన వెళ్లే దారిలో ఎక్కడ కూడా లోటుపాట్లు ఉండకూడదని వారు అధికారులకు తెలిపారు. వీరి వెంట పత్తికొండ ఆర్డీఓ మోహన్దాస్ ఆర్ అండ్ బి డిఈ సురేష్ రెడ్డి డి.ఎస్.పి శ్రీనివాస్ రెడ్డి తాసిల్దార్ రాజేశ్వరి విద్యుత్ ఏడి రమణారావు, ఇరిగేషన్ అధికారులు నారాయణరెడ్డి ,వెంకటేష్ నాయక్, పంచాయతీరాజ్ అధికారులు ,సిఐలు, ఎస్సై సురేష్, తదితరులు ఉన్నారు.

## టీడీపీ జనసేన అజెండా ఒకటే..

**విశాలాంధ్ర - కర్నూలు సిటీ :** తెలుగుదేశం, జనసేన పార్టీల అధ్యక్షులు మొదటి నుంచి వారిద్దరూ ఒకటే అన్నట్లుగా తాము చూశామని, అదే విషయాన్ని ప్రజలకి చెప్పామని వైసీపీ జిల్లా అధ్యక్షుడు బి.వై. రామయ్య అన్నారు. శుక్రవారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జనసేనకు అజెండా అంటూ ఏం లేదని, జెండా చంద్రబాబు కాళ్ళ దగ్గర తాకట్టు పెట్టడం, ఆయన ఇచ్చిన స్క్రిప్ట్ చదవడం మాత్రమే పవన్‌కు తెలుసని బి.వై. రామయ్య దుయ్యబట్టారు.కర్నూలులో జరుగుతున్న దీక్షలో ఐదారు మంది కూడా లేరని, సోమవారం చేపట్టిన బంద్ కూడా విఫలమైందన్నారు. చంద్రబాబు కేసులకు లాలూచీ పడి దిగజారుడు రాజకీయాలు చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారనేది టీడీపీ నేతలు గుర్తించుకోవాలన్నారు.కార్యక్రమంలో రాష్ట్ర వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎన్.గోపాల్ రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వర రెడ్డి, నగర అధ్యక్షురాలు సిట్ర సత్య నారయణమ్మ, మహిళా విభాగం జోనల్ ఇంచార్జ్ గాజుల శ్వేతరెడ్డి, పాల్గొన్నారు.

## ఎల్లార్తిలో గొలుసు దొంగతనం

**విశాలాంధ్ర -హొళగుంద :** మండలంలోని ఎల్లార్తి శిక్షావలి దర్గా దర్శనం కోసం వచ్చి రాత్రి వేళల్లో దర్గా ఆవరణంలో నిద్రించిన ఓ మహిళా మెడలోని మూడున్నర తులాల బంగారం గొలుసులు దొంగలు గురువారం ఎత్తుకెళ్లినట్లు ఆలస్యంగా సమాచారం అందింది. మహిళా భక్తురాలతో పాటు భర్త ,బంధువులు ప్రతి గురువారం స్వామివారి దర్శనానికి వస్తున్నారు. దర్గా ఆవరణంలో నిద్రిస్తున్న సమయంలో దొంగలు రాత్రి వేళల్లో మహిళా మెడలోని బంగారు గొలుసును ఎత్తుకెళ్ళారు. బాధితురాలు దర్గా ఈవో ,పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు రంగంలోకి దిగి పరిశీలించిన దర్గాలోని సీసీ కెమెరాలు పనిచేయక దొంగ ఆచూకీ దొరకడం కష్టంగా మారింది. అలాగే దర్గా బయట ఉన్న దుకాణాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించిన దొంగ ఆచూకీ లభ్యం కాలేదు. గొలుసు దొంగతనం జరగడంతో భక్తులు భయాందోళన చెందుతున్నారు.

## పాముకాటుతో బాలుడు మృతి

**విశాలాంధ్ర - దేవనకొండ రూరల్ :** పాముకాటుతో బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలోని నల్లచెలిమల గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కురువ సుధాకర్, గంగమ్మ దంపతు లకు ఇద్దరు కుమారులు. తల్లిదండ్రులతో ఇంటిలో నిద్రిస్తుండగా పెద్ద కుమారుడు రాహుల్ (6) గురువారం రాత్రి పాముకాటు కు గురయ్యాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ముక్కెళ్ల గ్రామానికి నాటు వైద్యం కోసం తీసుకు వెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఆ బాలుడు మృతితో ఆ కుటుంబంలో తీవ్ర విషాదఛాయలు అమ్ముకున్నాయి.

## వైసీపీ మండల కన్వీనర్ గా రమేష్ నాయుడు

**విశాలాంధ్ర - కోడుమూరు :** కోడుమూరు మండల వైసీపీ కన్వీనర్‌గా బైటింటి రమేష్ నాయుడుని జిల్లా వైసీపీ పార్టీ ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం వైసీపీ ప్రధాన పార్టీ కార్యాలయం నుంచి మండల కన్వీనర్ సంబంధించి నియామక ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా రమేష్ నాయుడు మాట్లాడుతూ కోడుమూరు మండలంలోనీ పార్టీ నాయకులు, కార్యకర్తలందరికీ అందుబాటులో ఉంటూ,వైసీపీ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. కన్వీనర్‌గా అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి,కుడా చైర్మన్,కోడుమూరు నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జి కోట్ల హర్షవర్ధన్ రెడ్డి,పార్టీ జిల్లా అధ్యక్షులు బివై రామయ్యలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. మండల కన్వీనర్ గా రమేష్ నాయుడును నియమించినందుకు వైసిపి శ్రేణులు ఆయనను పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. అలాగే జడ్పీటీసీ రఘునాథరెడ్డి రమేష్ నాయుడుకు అభినందనలు తెలియజేశారు.

## దర్గ ఈవో పై చర్యలు తీసుకోండి

**విశాలాంధ్ర - హొళగుంద :** ఎల్లార్తి శిక్షావలి - శేషావలి దర్గా ఈవో పై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కురువ చాముండేశ్వరి ,ఉప సర్పంచ్ వన్నూరు వలి ,వార్డ్ సభ్యులు శుక్రవారం ఆరోపించారు .దర్గాకు ప్రతి గురువారం అమావాస్య రోజుతో పాటు ఇతర రోజుల్లో భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారి దర్శనం తీసుకుంటున్నారని అన్నారు .అయితే ప్రతి అమావాస్య గురువారం రోజున పోలీసు బందోబస్తు కల్పించేవారని భక్తులకు భద్రత కల్పించాలంటూ ఎన్నోసార్లు ఈవో దృష్టికి తీసుకు వచ్చిన పట్టించుకోవడంలేదని వాపోయారు.కేవలం దర్గా ఆదాయం సమకూర్చడంలో పాకులాడుతున్నాడే తప్ప భక్తులకు ఎలాంటి భద్రతా సదుపాయం కల్పించడం లేదని ఆరోపించారు. దర్గా ఆవరణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవడంతో ఎందరో భక్తులు గొలుసు దొంగతనాలకు గురయ్యారన్నారు.సీసీ కెమెరా ,భక్తుల ఏర్పాట్లు ఇతర సమస్యలను గురించి తెలిపితే పోలీసులతో నాకు ఎలాంటి సంబంధం లేదంటూ సమాధానం ఇచ్చి నిర్లక్ష్యంగా ఉన్నాడని సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని భక్తులకు న్యాయం చేయాలని వారు కోరారు.ఈవిషయంపై వివరణ కోసం దర్గా ఈవో అబ్దుల్ రహమాన్ ను ఫోన్ ద్వారా విశాలాంధ్ర సంప్రదించగా ఫోన్ బిజీగా వచ్చింది అలాగే ఫోను లిఫ్ట్ చేయలేదు.

## కాలువలో జారిపడి వృద్ధుడు మృతి

**విశాలాంధ్ర -హొళగుంద :** మండలంలోని వందవాగాలిలో గురువారం ఉదయం 10గంటలకు అనారోగ్యంగా ఉన్నా వృద్ధుడు ప్రమాదవశాత్తు కాలు జారిపడి మృతి చెందాడు.పక్షవాతం ఉన్న వృద్ధుడు మలవిసర్జన కోసం కాలువలో దిగాడని,నీటి ప్రవాహానికి తట్టుకోలేక కొట్టుకుపో యాడని శవం కోసం కాలవవెంబడి చూడగా శుక్రవారం కాలువలో శవం తేలడంతో,గుట్టుచప్పుడు కాకుండా తీసుకో వచ్చి బంధువులు కాల్చివేశారు. దీనితో వృద్ధుడీ మృతిపై అనుమానాలను ప్రజలు వ్యక్తం చేశారు.ఎస్సై శ్రీనివాసులు విచారించగా మాకు ఎటువంటి ఫిర్యాదు సమాచారం అందలేదని అన్నారు.

## యువత అన్ని రంగాల్లో రాణించాలి

- జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్మాణంలో పీఠాధిపతి సుభుధేంద్ర తీర్థ స్వామి వారి కృషి మరువలేనిది
- ప్రతి పేద విద్యార్థి ఉన్నత చదువులు చదవాలనేదే సీఎం వైఎస్.జగన్మోహన్ రెడ్డి లక్ష్యం
- నెల వ్యవధిలోనే మంచి నీటి సౌకర్యం ఏర్పాటు
- అండర్ 14, అండర్ 17 క్రీడా పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

**విశాలాంధ్ర - మంత్రాలయం :** యువత చదువు తో పాటు క్రీడ రంగాల్లో కూడా రాణించాలని మంత్రాలయం నియోజకవర్గం హ్యాట్రిక్ ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో నిర్వహించిన అండర్ 14, అండర్ 17 క్రీడా పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి మండల విద్యాధికారులు మోహనుద్దీన్, రాఘన్న మర్యాద పూర్వకంగా పూలమాలలు వేసి శాలువ కప్పి స్వాగతం పలికారు. ఆగస్టు 15వ తేదీన జరిగిన పంద్రాగస్టు వేడుకల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు నీటి సౌకర్యం సరిగా లేదని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకుని వచ్చారు. త్వరలోనే పైప్ లైన్ ఏర్పాటు చేయించాలని సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య ను ఆదేశించారు. ఆదేశానుసారం చెప్పిన మాట ప్రకారం నెల వ్యవధిలోనే పైపు లైన్ పూర్తి చేయడం జరిగింది. క్రీడా పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి చేతుల మీదుగా మోటారు ఆన్ చేసి కుళాయి లు ద్వారా నీటి సరఫరా ను ప్రారంభించారు. రాఘవేంద్ర స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం విద్యార్థులు చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి నాడు-నేడు, అమ్మ ఒడి, గోరుముద్ద, విద్యా దీవెన, వసతి దీవెన పథకాలతో ఎంతో మేలు చేకూర్చడం జరిగిందన్నారు. అంతే కాకుండా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని పీఠాధిపతి శ్రీ సుభుధేంద్ర తీర్థ స్వామి వారు ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఏర్పాటు చేసి ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదవాలనే ఆశయంతో జగన్ మోహన్ రెడ్డి అడుగులు వేస్తున్నారని కొనియాడారు. ప్రతి విద్యార్థి బాగా చదివి పాఠశాల కు గుర్తింపు తేవాలని కోరారు. మెన్ననే కౌతాళం మండలం లోని పొదలకుంట గ్రామానికి చెందిన సోమనాథ్ గంగమ్మ కుమార్తె శివ లింగమ్మ ఆదోని కస్తూరి బా గాంధీ పాఠశాలలో చదువుతు అమెరికా కు వెళ్లడం ఎంతో అభినందనీయమన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్టేజి(వేదిక) ను మరింత పెద్ద గా నిర్మించాలని కోరగా వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం క్రీడా మైదానంలో విద్యార్థిని, విద్యార్థులను పరిచయం చేసుకున్నారు. రిబ్బన్ కట్ చేసి వాలీ బాల్ ఆడారు. కొద్దిగా సేపు కబడ్డీ ఆడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ జి. భీమారెడ్డి, ఇన్ చార్జ్ విశ్వనాథ్ రెడ్డి జడ్పీటీసీ మజ్జిగ గోవిందమ్మ, నాయకులు పెట్రోలు బంక్ శీనన్న, ఎస్ఐ కిరణ్, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, వైస్ ఎంపీపీ పులికుక్క రాఘవేంద్ర, చెట్నేహళ్లి సర్పంచ్ అంజిని, ఉప సర్పంచ్ లు హోటల్ పరమేష్, వీరనాగప్ప ఎంపీటీసీ సభ్యులు వెంకటేష్ శెట్టి, రామాంజనేయులు, విద్యా కమిటీ ఛైర్మన్ సబ్జల్లి, పాఠశాల సిబ్బంది, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అధికారం కోసమే పొత్తులు

**విశాలాంధ్ర - వెల్దుర్తి రూరల్ :** రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీల పొత్తు నేడుకొత్తే మికాదని,ప్రజలందరికీ ఈ విషయం తెలిసిందేనని, అయితే కొత్తగా పొత్తులు ఉంటాయి, కలిసి పోటీచేస్తామంటూ జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని, వారు కలిసేది కేవలం అధికారం కోసమేనని, ప్రజలకు మంచిచేయాలన్నా ఆలోచన ఏమాత్రం వారికిలేదని పత్తికొండనియోజకవర్గం ఎమ్మెల్యే కె.శ్రీదేవి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక గ్రామ పంచాయితీ కార్యాలయం నందు ఏర్పాటు చేసినపాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇంకెన్నిరోజులు రాష్ట్ర ప్రజలను మోసం చేస్తారని,ప్రజలను మభ్యపెట్టి, అధికారంలోకి రావాలనుకోవడం వారిమురత్వమేనన్నారు.అదేవిధంగా తెలుగుదేశం పార్టీహయాంలో 70శాతం పనులు జరిగాయని ప్రతిపక్షం చెప్పుకోవడమే గాని,ఎక్కడ 70శాతం పనులుజరిగాయో వారి హయాంలో చూపించాలన్నారు.ప్రతిసారి వైయస్.జగన్మోహన్రెడ్డి పై యుద్ధం చేస్తాం అంటూన్నారే తప్పా,ప్రజలను ఏనాడైనా పట్టించుకున్నారా అని ఆరోపించారు. రాబోయే 2024ఎన్నికలలో మరోసారి జగన్మోహన్రెడ్డి సిఎం కావడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ సరళ రెడ్డి వైకాపా మండలకన్వీనర్ బొమ్మన రవీంద్రనాథెడ్డి, జడ్పీటిసి సుంకన్న, అధికారులు తాసిల్దార్ శివ రాముడు ఎంపీడీవో శ్రీనివాసరావు ఈ ఓ ఆర్ డి నరసింహులు నాయకులు పాల్గొన్నారు.

## నూతన సచివాలయ భవనం ప్రారంభం

**విశాలాంధ్ర - వెల్దుర్తి రూరల్ :** మండల కేంద్రంలో సచివాలయం-1 నూతన భవనాన్ని పత్తికొండ నియోజకవర్గం ఎమ్మెల్యే కె. శ్రీదేవి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె.శ్రీదేవి మాట్లాడుతూ రాష్ట్రంలో సుపరిపాలనతీసుకురావడమే సిఎం జగన్ లక్ష్యమని, అందులో భాగంగానే ప్రజలందరికీ సమన్యాయం జరిగే విధంగా నేడు పరిపాలనసాగిస్తున్నారన్నారు. రానున్న రోజులలో కూడా సిఎం జగన్నుమరోసారి గెలిపించుకోవాల్సిన బాధ్యత మసందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలోమండల ఎంపిపి బొమ్మనసరళా ర విరెడ్డి, సర్పంచ్ శైలజ, పట్టణ వైకాపా కన్వీనర్ వెంకట్నాయుడు, పార్టీ నాయకులు, పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు పనిభారం తగ్గించాలి

**విశాలాంధ్ర - పత్తికొండ :** హిందీ టీచర్లకు పని భారం తగ్గించాలని ఎస్టీయు రాష్ట్ర కౌన్సిలర్స్ కొత్తపల్లి సత్యనారాయణ, కుంపటి నారాయణ, జిల్లా ఆర్థిక కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి లు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్టీయు ప్రతినిధి బృందం పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, ఉర్దూ పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలుసుకొని రెండవ రోజు సభ్యత్వం నమోదు చేయించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 1200 మంది నుండి 1300 మంది వరకు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని,హిందీ సబ్జెక్ట్ బోధనకు ఓకే టీచర్ ను నియమించడం వల్ల బోధనతోపాటు నోట్ బుక్స్, ప్రాజెక్టు వర్క్స్, ఫార్మేటివ్, సమ్మేటివ్ పరీక్షల నిర్వహణ, మూల్యాంక నం చేయడం వంటి సమస్యలు తలెత్తి పని భారం ఎక్కువైపోయి, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మిగిలిన సబ్జెక్టులు మాదిరిగానే హిందీ సబ్జెక్టు కు కూడా అన్ని ఉన్నత పాఠశాలల్లో 1:35 ప్రకారం హిందీ స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ టి యు మండల అధ్యక్షులు బలరాముడు, నాయకులు బీరప్ప,చెన్నకేశవరావు, ఇక్బాల్ హుస్సేన్, నాగేశ్వరరావు,హుల్తేన్న, మండ్ల వెంకటేశ్వర్లు, జయచంద్ర, కృష్ణమూర్తి, తిప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

## భావితరాలకు ఆదర్శం మోక్షం గుండా విశ్వేశ్వరయ్య

**విశాలాంధ్ర - కర్నూలు సిటీ :** ఆధునికతతో కూడిన జలాశయాల నిర్మాణంలో భావితరాలకు భారతరత్న అవార్డు గ్రహీత మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఆదర్శనీయుడని హంద్రీనీవా సుజల స్రవంతి పథకము జిల్లా పర్యవేక్షణ ఇంజనీర్ రాంగోపాల్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్ ఆధ్వర్యంలో లయన్స్ జిల్లా అడిషనల్ క్యాబినెట్ సెక్రటరీ లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అధ్యక్షతన శనివారం బి క్యాంప్ లోని హంద్రీనీవా సుజల స్రవంతి సర్కిల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా పర్యవేక్షిక ఇంజనీర్ రాంగోపాల్ పాల్గొన్నారు. భారతదేశ ఆర్థిక అభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర కీలకమన్నారు .రిటైర్డ్ ఇంజనీర్ ఇన్ చీఫ్ కే. జలంధర్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతతో కూడిన ఇంజనీరింగ్ విద్యకు నేడు ఎక్కువ ప్రాధాన్యత ఉన్నదన్నారు .విశ్రాంత ఎస్.ఇలు ఆదిరామిరెడ్డి, కృష్ణారెడ్డి ,మహానంది, సుధాకర్ రెడ్డి లు మాట్లాడుతూ యువత మోక్షగుండం విశ్వేశ్వరయ్య అందించిన ఇంజనీరింగ్ విజ్ఞానాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు .లయన్స్ జిల్లా అడిషనల్ క్యాబినెట్ సెక్రటరీ లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ భారత దేశ ఇంజనీరింగ్ విజ్ఞానాన్ని ప్రపంచ దేశాలకు చాటి చెప్పి భారత దేశ ఔన్నత్యాన్ని పెంపొందించిన మహనీయుడు రాజనీతిజ్ఞుడు భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్ ఉపాధ్యక్షులు లయన్ పవన్ కుమార్, డైరెక్టర్ చిన్నస్వామి, డి.ఇ రెడ్డి పోగు చంద్రశేఖర్ లు,రిటైర్డ్ ఇంజనీర్లు కేసి నారాయణ,రహమతుల్లా ,రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ మనోహర్, చంద్రశేఖర్ ,సోమయ్య, సుధాకర్ రెడ్డి ,ప్రసాద్ రెడ్డి,అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయ్ కిషోర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్ ,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజన్ బాబు ,శివప్రసాద్ ,మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ పాలనకు రోజులు దగ్గరపడ్డాయి

**విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు :** రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రజల భవిష్యత్తు బాగుంటుందని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి టి.జి భరత్ అన్నారు. నగరంలోని ధర్నా చౌక్ వద్ద తెదేపా ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలో టిజి భరత్ పాల్గొన్నారు. ఈ దీక్షకు జనసేన నేతలు సురేష్, అర్షద్ తో పాటు ఇతర నేతలు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా టి.జి భరత్ మాట్లాడుతూ వైసీపీ పాలనకు రోజులు దగ్గరపడ్డాయి అని చంద్రబాబును కలిసి వచ్చిన తర్వాత జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ మాట్లాడిన ప్రతి మాట ఆయన మనసులో నుంచి వచ్చిందన్నారు. నాలుగున్నర సంవత్సరాల వైసీపీ పాలనపై ఆయన మాట్లాడారన్నారు. చంద్రబాబు అవునంటారో కాదంటారో అన్నది పక్కన పెట్టి టీడీపీతో కలిసి ఎన్నికల్లో పోటీ చేయబోతున్నామని పవన్ కళ్యాణ్ చెప్పే పరిస్థితి వచ్చిందన్నారు. చంద్రబాబుని ఆధారాలు లేకుండా అరెస్టు చేశారని ప్రజలు బాధపడుతున్నారన్నారు. ఆధారాలు లేకుండా ఇలా చేయడం సరైంది కాదన్నారు. రాష్ట్రంలో రాజధాని ఎక్కడా అంటే చెప్పే పరిస్థితి లేదన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం అప్పట్లో ఆ రాష్ట్ర ప్రజలు పౌరుషంతో పోరాడి తెచ్చుకున్నారని.. మన రాష్ట్ర ప్రజల్లో చైతన్యం రావాలన్నారు. అప్పుడే పాలకుల్లో భయం ఉండి సరైన విధంగా నిర్ణయాలు తీసుకుంటారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ర్యాంకింగ్స్ లో మొదటి పది స్థానాల్లో మన రాష్ట్రానికి చోటు లేదని. ఇప్పుడు జరుగుతువన్నీ డైవర్షన్ పాలిటిక్స్ అన్నారు. అందుకే చంద్రబాబు చెప్పిన విధంగా ఆయన నిర్దేశించిన కార్యక్రమాలు చేస్తూనే ఉన్నామన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుస్తున్నామన్నారు. గతంలో ఫోన్ నంబర్ అడిగితే చెప్పడానికి ప్రజలు భయపడేవారని.. కానీ ఇప్పుడు చంద్రబాబు కోసం సంతకాల సేకరణ చెపడుతున్నామంటే స్వయంగా ప్రజలే వచ్చి సెల్ నంబర్ ఇచ్చి సంతకాలు చేస్తున్నారన్నారు. ప్రజలు గత ప్రభుత్వ పాలనకు ఇప్పటి పాలనకు తేడా ఏంటో గమనించాలన్నారు. నాయకులు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని, ప్రజా సంఘాలతో మాట్లాడి జరుగుతున్న పరిస్థితులను వివరించాలన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. అమ్మ ఒడి అందరికీ ఇస్తామని చెప్పి ఇప్పుడు ఒక్కరికే ఇస్తున్నారని. తమ పార్టీ వస్తే ఎంత మంది పిల్లలు ఉన్నా అందరికీ ఇస్తామన్నారు. చంద్రబాబు తీసుకొచ్చిన స్కిల్ డెవలప్మెంట్ ద్వారా శిక్షణ పొందిన ఎంతో మంది పెద్ద పెద్ద కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. వాళ్లే సోషల్ మీడియాలో ఈ విషయాలను చెబుతున్నారన్నారు. సరైన నాయకుడు ఉంటే ప్రజలు సంతోషంగా ఉంటారన్నారు. కర్నూల్లో తాను ఎమ్మెల్యే అయితే పరిశ్రమలు తీసుకొచ్చి ప్రజలకు ఉపాధి, యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కర్నూలు అసెంబ్లీ మహిళా కమిటీ అధ్యక్షురాలు మారుతీ శర్మ, క్రిస్టియన్ సెల్ టౌన్ ప్రెసిడెంట్ ప్రసాద రావు, టి.ఎన్.ఎస్.ఎఫ్ టౌన్ ప్రెసిడెంట్ రాజ్ కుమార్, స్టేట్ బిసీ సెల్ మహిళా ఆర్గనైజింగ్ సెక్రటరీ సంజీవ లక్ష్మి, క్లస్టర్ ఇంచార్జి చంద్రశేఖర్, వార్డు ఇంచార్జీలు గున్నామార్క్, రాజశేఖర్, సురేంద్ర, మనీష్ నాయుడు, బాలు, అజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

**విశాలాంధ్ర - కర్నూలు లీగల్ :** టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకి బెయిల్ రావాలని కోరుతూ గౌరు చరిత రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం కల్లూరు ఎస్టేట్ లో జఫ్ఫార్ మస్జిద్ నందు ముస్లిం పెద్దలతో ప్రత్యేక దువా ప్రార్థన చేయడం జరిగింది. ఈ సందర్భంగా మైనారిటీ రాష్ట్ర నాయకులు మౌలాలి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై కక్ష సాధింపుతోనే ఆయనను అరెస్ట్ చేశారని వారు విమర్శించారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గ మైనారిటీ అధ్యక్షుడు యస్. ఫిరోజ్, బాషీద్, మాలిక్, ఇబ్రహీం, దొడ్డి పాడు మాబాష , వలి, ఖాజా, రఫిక్, సర్దార్, షకీర్, బాషా, నిస్సార్, చాంద్ బాషా, గోల్డ్ షాపు ఇబ్రహీం, మబువలి, పాల్గొన్నారు.

**విశాలాంధ్ర - పెద్దకడబూరు :** టీడీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబును ఎదుర్కోలేక వైసీపీ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టడం రాక్షస పాలనకు నిదర్శనం అని మంత్రాలయం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జీ తిక్కారెడ్డి ఎద్దేవా చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ ఆవరణంలో చంద్రబాబుకు మద్దతుగా మేము సైతం అంటూ తిక్కారెడ్డి ఆధ్వర్యంలో రిలే నిరహార దీక్షలు చేపట్టారు.ఈ దీక్షా కార్యక్రమంలో టిడిపి రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి , టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, పరిశీలకులు శివబాల, మండల కన్వీనర్ బసలదొడ్డి ఈరన్న, లీగల్ సెల్ అధ్యక్షులు బాబురావు, నాయకులు ఏసేపు, మల్లికార్జున, మీసేవ అంజినయ్య, దశరథరాముడు అంజి, వీరేష్ గౌడ్,నరసన్న, ముక్కన్న, మల్దకల్, బొగ్గుల నరసన్న, శ్రీనివాసులు,నర్సిరెడ్డి,మునెప్ప,శివ, చంద్రశేఖర్, మహాదేవ,చంద్ర,సత్యన్న గౌడ్,వెంకటరామిరెడ్డి, నరసింహారెడ్డి,ప్రతాప్ రెడ్డి, అయ్యప్ప, పెద్దయ్య, ఈరన్న, రాజశేఖర్, ఐ టిడిపి సల్మాన్ రాజ్, నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.